

# ఆఖరికి అయిదు నక్షత్రాలు

అబ్బూరి ఛాయాదేవి

ఆ రోజు శుక్రవారం. పొద్దున పది గంటలకి అందరం రెండు కారుల్లో బయలు దేరాం. మాధవరావు కారు ఒకటీ, ఇంకో స్నేహితుడి కారొకటీనూ.

హాస్పిటల్ ఊరికి దూరంగా కొండమీద ఉంది. మేముంటున్న చోటికి దాదాపు ఇరవై కిలోమీటర్ల దూరముంటుంది. కార్లున్నాయి కాబట్టి సరిపోయింది. ఆటోలయితే ఒళ్లు హూనం అయిపోతుంది ఆ రోడ్లమీద ప్రయాణం చేసేసరికి. బస్సులు అడపా తడపా అటువైపు వెడుతుండడం కనిపించింది. తిరుపతి కొండమీదికి వెడుతున్నట్టే అనిపించింది ఆ అయిదు నక్షత్రాల ఆస్పత్రి ప్రయాణం.

కార్లు విశాలమైన ఆవరణలో ప్రవేశించి పోర్టికో లో ఆగాయి. జవాను శాల్యూట్ కొట్టి కారు తలుపు తెరిచిపట్టుకున్నాడు. మాధవరావు కొలీగ్ గజానన్ ముందుగా కారు దిగి లోపలికి వెళ్లాడు. రిసెప్షన్ కౌంటర్‌లో ప్రవేశపత్రాలవీ తీసుకుని మాధవరావు కిచ్చాడు. వాటి మీద రాయవలసినవన్నీ రాసి మాధవ రావు సంతకాలు పెట్టాడు. కౌంటర్‌లో డబ్బు కట్టారు.

మేమంతా ఆ విశాలమైన హాల్లో తలో కుర్చీలో కూర్చున్నాం. చుట్టూ ఎక్కడ చూసినా పచ్చని ఆకులతో క్రోటన్స్ మొక్కలు నవనవలాడుతూ- పరీక్షగా చూస్తే గాని అవి ప్లాస్టిక్ ఆకులని తెలియడంలేదు- అంత మనోజ్ఞంగా కనిపిస్తున్నాయి! అవి ఫారిన్‌వి అయి వుంటాయి. అది నగరంలోకెల్లా పెద్ద హాస్పిటల్. ప్రసిద్ధి చెందిన హాస్పిటల్.

దాన్ని ఈ నగరంలో ప్రారంభించి అయిదారు సంవత్సరాలే అయినా, వేరే నగరాల్లో అప్పటికే ఆర్జిం చిన ఖ్యాతివల్ల, త్వరలోనే దీనిక్కూడా పేరు ప్రఖ్యాతు లొచ్చాయి. అది చాలా ఖరీదైన ఆస్పత్రి. సాధారణంగా పెద్ద పెద్ద వ్యాధుల గురించే వెడుతుంటారు అక్కడికి. పెద్ద పెద్దవాళ్లే తరచుగా వెడుతుంటారు దానికి. సామాన్యులకు అంతగా అందుబాటులో లేనిదది. మేమూ సామాన్యులమే. కానీ మాధవరావుకి రెండేళ్ల నుంచి వైద్యం చేస్తున్న కార్డియాలజిస్ట్ ఈ మధ్యనే ఈ హాస్పిటల్‌లో చేరాడు.

ఈ మధ్య నాలుగైదు రోజుల నుంచి వరుసగా గుండెల్లో సన్నని నొప్పి బయలుదేరి ఎడం భుజం మీదుగా అరచేతిలోంచి వెళ్లి చివరవరకూ పాకుతోంది. మాత్రలు వేసుకున్నా మళ్లీ మళ్లీ వస్తూంటే కార్డియాల జిస్ట్ గౌరీపతి దగ్గరకు వెళ్లాడు మాధవరావు. ''స్ట్రెస్ టెస్ట్'' మొదలైన పరీక్షలు చేసి ''మీరు ఏంజియోగ్రాఫ్ తీయించుకోవాలి. ఎంత తొందరగా తీయించుకుంటే అంత మంచిది'' అన్నాడు గౌరీపతి.

''ఏంజియోగ్రాఫ్ ప్రమాదకరమేమో కదా,'' అన్నాడు మాధవరావు కంగారుపడి.

''అబ్బే అదేం లేదు. అసలు చేయించుకోకుండా ఊరుకుంటేనే ప్రమాదం. అందుకే కదా చెబుతున్నాను మీకేం భయంలేదు. అంతర్జాతీయ ఖ్యాతి పొందిన డాక్టర్ పీటర్ ఇక్కడే వున్నారు ప్రస్తుతం. ఆయన రెండు మూడు వారాల్లో మళ్లీ కెనడా వెళ్లిపోతారు. అంచేత, ఈలోగా ఆయన వుండగానే చేయించుకుంటే మంచిది. మీరు నిశ్చింతగా మీ గుండెని ఆయన చేతుల్లో పెట్టొచ్చు,'' అని ధైర్యం చెప్పాడు గౌరీపతి.

ఈ సంగతి విన్నాక ముందు కరుణ కూడా కంగారుపడిపోయింది- ''అయ్యో, ఏంజియోగ్రామ్

చేయించుకోవాలా?'' అంటూ. మాధవరావు కొలీగ్ గజానన్ ధైర్యం చెప్పాడు. అతని మేనమామకి కూడా ఏంజియోగ్రామ్ జరిగిందట. బైపాస్ ఆపరేషన్ కూడా ఎంతో సునాయాసంగా జరిగిందట. వారంరోజుల్లో లేచి శుభ్రంగా తిరగడం మొదలుపెట్టాడుట.

మాధవరావు కొడుకు అమెరికాలో వున్నాడు. పెళ్లి అరునెలలు కూడా కాలేదు. ఇప్పుడీ విషయం ఫోన్ చేసి చెబితే కంగారుపడి బయలుదేరాలనుకుంటాడు. సెలవు దొరుకుతుందో లేదో, ఎందుకు ఇబ్బంది పెట్టడం అని చెప్పలేదు కొడుక్కి.

మాకూ, కొందరు దగ్గర స్నేహితులకూ తప్ప ఎవరికీ చెప్పలేదు. ఏముంది, నాలుగురోజుల్లో ఇంటి కొచ్చెయ్యడమే కదా అని.

అయినా, ఆలోచించేందుకూ, అందరినీ సంప్ర దించేందుకూ వ్యవధిలేదు. ప్రావిడెంట్ ఫండ్‌లోంచి అప్పు తీసుకొని, కొంత సేవింగ్స్‌లోంచి తీసుకుని కావ లసిన సొమ్ము సమకూర్చుకున్నాడు. అంతా హడావిడిగా ఏర్పాటు చేసుకున్నాడు.

ఆ హాస్పిటల్లో గదికి అద్దె రోజుకి ఏడువందల యాభై రూపాయిలు. పైన ఇంకా ఖరీదైన డీలక్స్ రూములున్నాయి. విన్నవాళ్లందరం నోళ్లు వెళ్లబెట్టాం. గదిలో మాత్రం అన్ని సదుపాయాలూ వున్నాయి. ఎయిర్ కండిషనర్, టి.వీ., ఇంటర్ కమ్ ఫోన్ వగైరా అంతా రాజభోగంలా వుంది. బెల్ నొక్కగానే బేరర్ వచ్చి ఎవరినైనా పిలవమన్నా, ఏదైనా తెచ్చిపెట్టమన్నా వెంటనే చేస్తాడు- అన్నీ ఫైవ్ స్టార్ హోటల్‌లోలాగ. ఇంటికన్నా గుడిపదిలం అన్నట్టుంది. ఏ లోటూలేదు. దర్జాగా వుంది. రోగికి ఒక మంచం, పక్కన తోడు పడుకునే వారికో సోఫాబెడ్డూ, అటు పక్కని టేబులూ, దానికి డ్రాయర్లూ, టేబుల్ మీద ఫ్లాస్కూ, మరోపక్క తళతళ లాడే బాత్‌రూమూ, మంచానికెదురుగా రెండు కుర్చీలూ, ఆ పక్కని టి.వీ. ఏదో సినిమా కేసెట్ వేసి వుంచుతారు, హాస్పిటల్ వాళ్లు టీవీలో ప్రోగ్రాం లేనప్పుడు.

చేసేవాళ్లుంటే రోగమంత భోగం లేదని సామెత. ఆ మంచం మీద, ఫోమ్‌పరుపు మీద రెండు పెద్ద ఫోమ్ దిళ్లని ఆనుకుని మాధవరావు పడుకుని నవ్వుతూ కబుర్లు చెబుతూంటే, హంసతూలికా తల్పం మీద ఎవరో మహారాజు శయనించినట్లుగా వుందిగాని రోగి పడుకున్నట్లు లేదు! అందరం కులాసాగా కబుర్లు చెప్పు కుని నవ్వుకుంటూంటే, ఒక చౌకీదార్ వచ్చి మమ్మల్ని బయటికి వెళ్లిపొమన్నాడు. రోగితోబాటు ఒకరిద్దరు తప్ప వుండకూడదన్నాడు. ఉండవలసిన వాళ్లు పాస్‌లు తీసు కోవాలన్నాడు.

ఏంజియోగ్రాఫ్ తీయవలసినది ఆ మర్నాడు ఉదయం, రోగి ఒకరోజు ముందుగానే చేరాలిట- కావలసిన పరీక్షలు చెయ్యడానికీ, ఇవ్వాల్సిన ఆహారం, మందులూ, ఇంజక్షన్లూ ఇవ్వడానికీనూ.

మేమంతా లేచి వచ్చేశాం. కరుణా, కూతురు అనుపమా అక్కడే వుండిపోయారు మాధవరావుతో బాటు.

మర్నాడు తొమ్మిదింటికి బయలుదేరి మళ్లీ హాస్పిటల్‌కి వెళ్లాం. ఆ రోజు అక్కడ చాలా హడావిడిగా వుంది. హాస్పటల్ 'షేర్ హోల్డర్స్'ట కొంతమంది వచ్చారు. వాళ్లు డాక్టర్లూ, జూనియర్ సర్జన్లూనూ. ఏవైనా క్లిష్టమైన పెద్ద ఆపరేషన్లు జరిగేటప్పుడు వాటిని గమ నించడానికి ఆ వాటాదార్లని పిలుస్తారుట. వాటాదార్లు అనగానే అదొక వ్యాపార సంస్థ అనిపిస్తుంది. ఎవరైనా అక్కడ పనిచేసే డాక్టర్లు ఏవైనా కేసులు తీసుకొస్తే వారికి కొంత కమిషన్ కూడా లభిస్తుందని అక్కడే విన్నాం.

వచ్చిన వాటాదార్లు కొందరు ఆకుపచ్చ గౌనులు వేసుకుని ఆపరేషన్ థియేటర్ వైపుకి వెళ్లారు. మాధవ రావుని అంతకుముందే లోపలికి తీసుకువెళ్లారు. థియేటర్‌కి ఇవతల ఒక హాలుంది. దాన్ని ఆనుకుని ఒక గది వుంది. దానికి అద్దాల తలుపులు. అక్కడ డాక్టర్లు విడిచి వెళ్లిన చెప్పులు తప్ప ఏమీ కనిపించడం లేదు. అద్దాలకివతల నడవలో వున్న కుర్చీల్లో కూర్చు న్నాం మేం గుసగుసగా మాట్లాడుకుంటూ.

ఒక గంటన్నర అయ్యాక, ఆపరేషన్ చూడటానికి వచ్చిన వాటాదార్లు ఇవతలకి వచ్చారు. మేమంతా ఆదుర్దాగా చూశాం వాళ్ల ముఖాలవైపు. వాళ్లలో ఒకావిడ చిరునవ్వు నవ్వి, ''ఏంజియోగ్రామ్ బాగా జరిగింది. ఏం భయంలేదు,'' అంది.

'అమ్మయ్య?' అనుకున్నాం. కానీ కరుణ ముఖం లో మాత్రం ఇంకా ఆందోళన గూడుకట్టుకుంది. గుండెలో బ్లాక్స్ వున్నయో లేవో ఎంతవరకూ వున్నాయో తెలియాలి కదా. అంతవరకూ ఆందోళన తప్పదు.

రిపోర్ట్ సాయంకాలానికిగానీ రాదన్నారు. కానీ, మర్నాడు పొద్దున్నకిగానీ రిపోర్ట్ రాలేదు.

అనుకున్నంతా అయింది.

బైపాస్ ఆపరేషన్ వెంటనే జరగాలన్నారు. మూడుచోట్ల అవరోధాలేర్పడ్డాయి. గుండెలో- నూరు

శాతం ఒకటీ, తొంభై శాతం ఒకటీ, ఎనభై శాతం ఒకటీ అని చెప్పారు.

అందరి గుండెలూ బరువెక్కాయి. తీగ లాగితే డొంకంతా కదులుతుంది. ఏంజియోగ్రాఫ్ తీయిస్తే, తరువాత ఇంక బైపాస్. ఇదంతా ఒకటి తరువాత ఒకటి అనుసరించడం మామూలే అన్నారు తెలిసినవాళ్లు.

'రోటిలో తల దూర్చాక రోకటిపోటుకి వెరపేలా,' అన్నట్లుగా వుంది పరిస్థితి.

ఆపరేషన్ శుక్రవారం చెయ్యాలని నిర్ణయించారు సర్జన్లు. అంటే, ఇంకా అయిదు రోజుల వ్యవధి వుంది. అంతవరకూ హాస్పిటల్లోనే వుంటే మంచిదన్నారు వాళ్లే. రోజుకి ఏడువందల యాభై రూపాయలు గదికి. కక్కుర్తి పడి రోగిని ఇంటికి తీసికెడితే, తీరా దారిలోనో, ఇంటి కెళ్లాకో ఏదైనా అయితే ప్రమాదం కదా? వాళ్ల సలహా ప్రకారం అక్కడే వుండటానికి నిశ్చయించుకున్నారు మాధవరావూ, కరుణా, అందరం 'అవును, అదే మంచిది,' అనుకున్నాం.

ఈ అయిదారు రోజులూ కాలక్షేపానికేం లోటు లేదు. విజిటింగ్ అవర్స్‌లో గది కిటకిటలాడుతూ వుంది మాధవరావుని చూడటానికి వచ్చే బంధుమిత్రులతో. గదిలో ఎయిర్ కండిషనర్ పనిచెయ్యడం లేదు ఏదో లోపంవల్ల. చలికాలం అవడం వల్ల ఫాన్ కూడా అవ సరం లేదు కాబట్టి ఫరవాలేదు అనిపించింది. చౌకీదారు వెళ్లమని హెచ్చరించేవరకూ గదిలోనూ, వరండాలోనూ తచ్చాడుతూండే వాళ్లం.

రేప్పొద్దున్న ఆపరేషన్ అనగా ముందుగానే చెప్పారు డాక్టర్లు. "ఆపరేషన్ జరిగేటప్పుడు రోగికి రక్తం ఇవ్వాలి వుంటుంది. అతని గ్రూపు రక్తం తాజాగా అప్పటికప్పుడు మీరే ఇవ్వవలసి వుంటుంది. గుండె ఆపరేషన్‌కి మా దగ్గర నిలవ వున్న రక్తం పనికిరాదు," అన్నారు.

ఆ సంగతి చెప్పగానే, మాధవరావు బ్లడ్ గ్రూపుకి చెందిన ఆప్తమిత్రులు నలుగురైదుగురు ముందు కొచ్చారు.

శుక్రవారంనాడు ఉదయమే ఎనిమిది గంటలకి ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెడతారని చెప్పారు. మేమంతా, రక్తం ఇచ్చే స్నేహితులతో సహా పొద్దున్నే ఏడుగంటలకే హాస్పిటల్‌కి చేరుకున్నాం. మామూలుగా అయితే ఆ సమయంలో విజిటర్స్‌ని లోపలికి రానివ్వరు నిర్ణీత సమయంలో తప్ప. ప్రత్యేక అనుమతి ముందు గానే తీసుకున్నందువల్లా, రక్తదానం కోసం లోపలికి వెళ్లి తీరాలి కనుకా, నిరాటంకంగా లోపలికి వెళ్లగలిగాం.

తీరా వెళ్లాక చూస్తే, రోగి వున్న గదిలో గీజర్ పని చెయ్యడం లేదు (ఎయిర్ కండిషనర్ అంతకుముందే పనిచెయ్యడం మానేసింది). మాధవరావు గడ్డం గీసుకుని తయారుగా వున్నాడు స్నానానికి. వేడినీళ్లు లేవు. సరే, బెల్ నొక్కి రూమ్‌బోయ్‌ని వేడినీళ్లు తెమ్మ న్నారు. వాడు ఓ అరగంట పోయాక చచ్చిచెడీ ఒక బకెట్ నీళ్లు పట్టుకొచ్చాడు.

స్నానం చేసి తెల్లని బట్టలు వేసుకుని స్వచ్ఛంగా వున్నాడు మాధవరావు. రాత్రి వేలియమ్ మాత్ర వేసినా అంతగా నిద్రపట్టినట్టులేదు. అయినా నవ్వుతూ కులాసాగా కబుర్లు చెప్పాడు అందరితో. ఎవరి మనసులో వారికి కంగారూ, భయం తొలుస్తున్నప్పటికీ, పైకి అందరం నవ్వు ముఖాలతోనే వున్నాం.

ఎనిమిదిన్నర దాటాక, ఒక కుర్రవాడొచ్చి, "పేషెంట్‌ని రమ్మంటున్నారు," అన్నాడు. అందరం తెల్ల బోయాం క్షణంసేపు. అదేమిటి! ఇదేమన్నా పెళ్లికొడుకు కాశీయాత్రకి బయలుదేరడం అనుకున్నారా అని ముఖ ముఖాలు చూసుకున్నాం ఏం చెయ్యాలో అర్థంకాక.

మాధవరావు నవ్వేసి, "చలో భాయ్," అంటూ చకచకా ముందుకి నడిచాడు. మేము అతన్ని అను సరించాలో వద్దో తెలియక మూఢమతుల్లా అక్కడే నిల బడిపోయాం. ఇంతలో ఒక నర్స్ పరుగెత్తుకుంటూ వచ్చి, "అదేమిటి, పేషెంట్ నడిచివెళ్లిపోతున్నాడు!" అంటూ అరిచి, మాధవరావుని వెనక్కి పిలిచింది.

ఈలోగా స్ట్రెచర్ తీసుకొచ్చారు ఇద్దరు. మాధవ రావు దానిమీద పడుకుంటూ పకపకా నవ్వాడు. ధైర్యం గా చెయ్యి వూపుతూ థియేటర్‌కి దారితీసే హాలు గుమ్మందాకా వెళ్లేవరకూ నవ్వుతూనే వున్నాడు. గుమ్మం దగ్గర స్ట్రెచర్ మీంచి దిగి, కూతురు అనుపమని దగ్గరికి రమ్మని, అప్యాయంగా కావిలించుకుని రెండు బుగ్గల మీదా ముద్దు పెట్టుకుని, తను కూడా పెట్టించు కున్నాడు. కరుణకేసి ప్రత్యేకంగా చూసి, అందరివైపూ చూస్తూ చెయ్యి ఊపి మళ్లీ స్ట్రెచర్ మీదికెళ్లాడు. అద్దాల తలుపులు మూసుకున్నాయి.

ఆపరేషన్‌కి ముందు పేషెంట్‌ని తయారు చెయ్యడానికి గంటా గంటన్నర పడుతుందని, తరవాత ఆపరేషన్‌కి దాదాపు నాలుగు గంటలసేపు పడుతుందనీ విన్నాం. అంచేత ఒంటిగంట దాటేవరకూ నిరీక్షించా ల్సిందే.

ఈలోగా, రక్తదానం చేసే మిత్రుల్ని క్రింది అంతస్తుకి తీసుకువెళ్లారు. అక్కడ ఒక్కొక్కరినే లోపలికి

తీసుకువెళ్లి, మళ్లీ రక్తపరీక్ష చేసి తరవాత రక్తం తీసుకుని, కొంచెంసేపు విశ్రాంతి తీసుకున్నాక ఇవతలికి పంపించారు. ఇవతలికి రాగానే ఒక్కొక్కరికీ ఒక ప్లేటులో నాలుగు బిస్కట్లూ, ఒక పళ్లరసం ప్యాకెట్టూ ఇచ్చారు శక్తి పుంజుకోడానికి. మావాళ్లు కూడా ఏపిల్ ముక్కలూ అవీ పెట్టారు వాళ్లకి. హాస్పిటల్ వాళ్లు ఇచ్చిన వాటిని చూసి 'ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారు వాళ్ల కోసం!' అనుకున్నాం.

మేం పొద్దున్నే వచ్చెయ్యడం వల్ల ఇంట్లో ఏమీ తినకుండా వచ్చేశాం. అందుకని హాస్పిటల్ కేంటీన్‌కెళ్లి టిఫిన్ తీసుకున్నాం. ఇడ్లీ, వడలూ, కాఫీ- అన్నీ వేడిగా బావున్నాయి. ఖరీదు కూడా కాస్త ఎక్కువే మరి!

ఒంటిగంటా ఆ ప్రాంతాలకి ఆపరేషన్ అయిపోతుంది కదా, పేషెంట్‌ని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కి తీసుకురాగానే, మేం ఇంటికి వెళ్లి రావచ్చుననుకున్నాం.

ఒంటిగంటలయింది. రెండయింది. పేషెంట్ గురించి ఏ సమాచారమూ లేదు. ఇటూ అటూ తిరుగుతూ కనిపించిన నర్సుల్ని అడిగితే, 'ఇంకా అవుతోంది. ఇంకా టైము పడ్తుంది,' అని చెప్పేసి చకచకా తమ పనుల మీద వెళ్లిపోవడమేగానీ, నిదానంగా సమాధానం చెప్పేవారెవరూ కనిపించలేదు.

బయట వరండాలో తిరుగుతూంటే చౌకీదార్ చూసి ఎక్కడ బయటికి తరిమేస్తాడో అని భయపడి గదిలోనే కూర్చున్నాం. మాలో ఒకళ్లిద్దరు అప్పుడప్పుడూ వరండాలోకి వెళ్లేవాళ్లం డాక్టర్లయినా, ఎవరైనా కనిపిస్తారేమో, ఏమైనా కబురు చెబుతారేమోనని. ఏ కబురూ లేదు.

మాలో కొందరు భోంచేసి రావడానికి కేంటీన్‌కి వెళ్లారు. కొందరం గదికి తెప్పించుకున్నాం. గదికి తెప్పించుకుంటే భోజనం ప్లేటు ఇరవై రూపాయిలు. కరుణ సయించడం లేదని మొత్తుకుంటున్నా బలవంతాన మజ్జిగ అన్నం తినిపించాం.

నాలుగవుతూండగా, మాకు పరిచయమైన జూనియర్ డాక్టర్ ఒకరు కనిపిస్తే "ఏమిటి, ఇంకా ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కి తీసుకురాలేదు! ఆపరేషన్ ఇంకా పూర్తి కాలేదా డాక్టర్?'' అంటూ కంగారుగా అడిగాం.

"ఆ, ఆ అవుతోందండీ, ఇంకా కుట్లు వెయ్యడానికి టైము పడుతుంది,'' అని చెప్పేసి హడావిడిగా వెళ్లిపోయాడు.

మాలో ఆందోళన అంతకంతకూ ఎక్కువుతోంది. ఏమిటింతసేపు పడుతోంది? ఏమైనా కాంప్లికేషన్ ఏర్పడిందా? లోపల ఏమిటవుతోందో చెప్పేవాళ్లు లేరు. ఏవేవో వూహించుకుంటూంటే ఉద్రిక్తత పెరుగుతోంది.

ఆ క్రితంరోజు పొద్దున్న వరండా పక్కనున్న పెద్ద హాల్లో తెరల వెనకాల కుర్చీల్లో కూర్చుని చాలామంది ఏదో సినిమాలాంటిది చూస్తున్నారు. ఏమిటోనని మేమూ తొంగిచూశాం. ఎదురుగా తెరమీద సర్జన్ ఆపరేషన్ చెయ్యడం కనిపిస్తోంది. లోపల థియేటర్‌లో జరుగుతున్న ఆపరేషన్ హాస్పిటల్ వాళ్ల టీవీ ద్వారా ఇక్కడ తెరమీద చూపిస్తున్నారు!

అక్కడ కూర్చుని చూస్తున్నవాళ్లు డాక్టర్లే (వాటాదార్లు). తెరమీద చూస్తూంటే, ఎదురుగా నించుని ఆపరేషన్ చూస్తున్నంత స్పష్టంగా వుంది. ఆ పెద్ద తెర మీద కలర్‌లో ఆ రక్తం, ఆ చుట్టూ మాంసం, ఆ కత్తులూ చూస్తుంటే ఒళ్లు గగుర్పొడిచింది. అది ఆర్థోపెడిక్ ఆపరేషన్. మధ్యలో ఒక ఎముక మీద పెద్ద సుత్తితో కొడుతూంటే ఠంగ్ ఠంగ్ మని శబ్దం అవుతోంది. అచ్చు కమ్మరం పనిలాగే వుంది!

మన మాధవరావు బైపాస్ ఆపరేషన్ కూడా అలాగే తెర మీద చూపిస్తారేమో, అంతా చూడొచ్చునని ఆశపడ్డాం.

కానీ, అసలు కబురే అందడం లేదు. లోపల ఏం జరుగుతోందో తెలియదు. మా అందరికీ గుండెలు బిగపెడుతున్నాయి.

రాత్రి ఏడయింది. ఎవరో వార్డ్‌బోయ్ మా గదికొచ్చి చిన్న చీటీ ఒకటి ఇచ్చాడు. "ఏమిటి ఎందుకు?'' అని అడిగితే, "వెళ్లి కౌంటర్‌లో డబ్బు కట్టాలండి, ఇందులో రాసి వుంది,'' అని చెప్పి వెళ్లిపోయాడు.

బెలూన్ థెరపీ చెయ్యడానికి పద్దెనిమిది వేలు కట్టాలని వుంది ఆ చిన్న చీటీలో. గజానన్‌గారూ, భుజంగంగారూ ఆ చీటీ తీసుకుని కౌంటర్ దగ్గరికి వెళ్లారు. అంత చీకటిపడ్డాక, అప్పటికప్పుడు పద్దెనిమిది వేలు కట్టమని బిల్లు పంపించడం ఏమిటి? ఆపరేషన్ నిశ్చయం కాగానే ఎడ్వాన్స్‌గా యాభైవేలు కట్టారు. మళ్లీ ఇప్పుడిది. ఏమైనా తప్పదుకదా. ఒకవైపు కంగారు - మాధవరావు పరిస్థితి ఎలా వుందో అని.

అంతకుముందు మేం విన్న కథల్నిబట్టి గుండెలో బ్లాక్స్ మరీ ఎక్కువగా లేనప్పుడూ, బైపాస్ ఆపరేషన్ అవసరం అనిపించనప్పుడూ బెలూన్ థెరపీతో వ్యాధి నయం చేస్తారని అనుకున్నాం. కానీ, బైపాస్ అయ్యాక బెలూన్ థెరపీ చెయ్యడం. ఏమిటీ? ఇంతకీ ఏమిటవుతోంది లోపల? పరిస్థితి విషమించలేదు కదా?

ఇవతల మాది నిస్సహాయ పరిస్థితి. మగవాళ్లిద్దరూ కారు తీసుకుని ఊళ్లోకి వెళ్లి కావల్సిన సొమ్ము పట్టుకొచ్చి హాస్పిటల్ కౌంటర్‌లో కట్టారు.

రాత్రి పావు తక్కువ తొమ్మిదయింది. అప్పుడొక నర్స్ వచ్చి చెప్పింది- స్టిచెస్ వేస్తున్నారు. ఇంకో అరగంటలో ఇంటెన్సివ్‌కి తీసుకొస్తారు అని. గుండెల మీంచి పెద్ద బరువు దింపినట్టయింది అందరికీ.

తొమ్మిదిన్నర దాటింది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కి పేషంట్‌ని తీసుకొచ్చినట్టు కబురొచ్చింది. ఒక అరగంట పోయాక, భార్యనీ, కూతుర్నీ లోపలికి రెండు నిమిషాల పాటు అనుమతిస్తారని చెప్పారు.

మాలో కొంతమందిమి ఇళ్లకి తిరిగి వెళ్లిపోయాం, మళ్లీ పొద్దున్న రావచ్చునని.

గదిలో వున్న వాళ్లకి నిద్రపట్టక కొట్టుకుని కొట్టుకుని అప్పుడే కునుకు పట్టబోతూంటే, అర్ధరాత్రి సమయంలో ఎవరో తలుపు తట్టారు. తలుపుతీసి, కంగారుపడుతూ ఏమిటని అడిగితే, "పొద్దున్న మీరిచ్చిన రక్తం స్టాక్ అయిపోయింది. మళ్లీ అర్జంటుగా కావాలి," అంది నర్స్.

"పేషంట్ కెలా వుంది? ఏమైంది?" అని అడిగితే, "ఆపరేషన్ థియేటర్‌లో వున్నారు," అని చెప్పి హడావిడిగా వెళ్లిపోయింది నర్స్.

భుజంగరావుగారూ వాళ్లు కిందికొచ్చి, కారు తీసుకొని ఇంటికొచ్చారు. రక్తదానం చేసే ఇరుగుపొరుగు వారిని కొందర్ని తీసుకుని తిరిగి హాస్పిటల్‌కి చేరుకునే సరికి తెల్లవారుఝామయింది.

ఆఫీసులో పనిచేసే వాళ్లనీ, స్నేహితుల పిల్లల్నీ మరి కొంతమందిని పోగు చేసుకుని పదిగంటలకి మేమూ చేరుకున్నాం హాస్పిటల్‌కి. అంతా కలిసి యాభై మందిదాకా రక్తదానం చేశారు. కబురు తెలిసి ఇంకా వస్తున్నారు! హాస్పిటల్‌వాళ్లు రక్తం తీసుకుంటూనే వున్నారు. గ్రూప్ వేరైనా ఫరవాలేదు. బదులుగా మా దగ్గరున్నది పేషంట్‌కిస్తామని చెప్పారు. హాస్పిటల్లో రక్తం కొనాలంటే పాకెట్ రెండువందల రూపాయిలవుతుంది. ఇంతమంది దగ్గర రక్తం తీసుకుంటున్నారు. పాపం మాధవరావుకి ఇంత రక్తం అవసరమవుతోందంటే పరిస్థితి ఎలా వుందో అని మా ఆందోళన.

కరుణ కన్నీళ్లు ఆపుకోలేకపోతోంది. అంతవరకూ తెచ్చిపెట్టుకున్న ధైర్యం అంతా పటాపంచలవుతోంది. హఠాత్తుగా వరండాలో కార్డియాలజిస్ట్ గౌరీపతిగారు కనిపించేసరికి కరుణ ఆయన్ని పిలిచి అడిగింది, "ఆయనకెలా వుంది, నిజం చెప్పండి," అని.

"ఇలా అవుతుందనుకోలేదండీ, కొంచెం కాంప్లికేషన్స్ వచ్చాయి," అన్నాడు సన్నగా.

ఏమిటో వివరంగా చెప్పమని అడిగితే, "కిడ్నీ ఫెయిలయింది," అన్నాడు.

"అంటే పరిస్థితి ప్రమాదకరంగా వుందా? ఏ సంగతీ చెప్పండి. ప్లీజ్, మా అబ్బాయి అమెరికాలో వున్నాడు, వాడికి చెప్పాలి," అంది ఏడుస్తూ.

"ఏం భయపడకండి, నేను వెళ్లి మళ్లీ కనుక్కుంటాను," అని చెప్పి థియేటర్‌లోకి వెళ్లిపోయాడు.

భయపడక ఏం చెయ్యాలి?

అంతలోనే మరో రెండు బిల్లులు పట్టుకొచ్చాడు హాస్పిటల్ కుర్రాడు- డయాలిసిస్ మెషిన్ కోసమూ, ఏదో లైఫ్ సేవింగ్ ఇంజక్షన్ కోసమూ డబ్బు కట్టాలి.

అది చూడగానే గాభరా. "ఏమిటి, ప్రాణాపాయ స్థితిలో వున్నారా? దయచేసి చెప్పండి ఎవరినైనా కనుక్కుని చెప్పండి," అని బ్రతిమాలింది కరుణ ఒక నర్స్‌ని.

ఆ నర్స్ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడి, "ఇంకా ఇరవైనాలుగు గంటలు పోతేగాని ఏమీ చెప్పలేమంటున్నారు," అని చెప్పింది.

అప్పటికి బైపాస్ ఆపరేషన్ జరిగి ముప్ఫయి రెండు గంటలయి వుంటుంది.

ఏమైనా, అమెరికాకి ఫోన్ చేసి కొడుకుతో చెప్పాలనుకుంది కరుణ. హాస్పిటల్లో ఫోన్లు ఏవీ పనిచేయడం లేదు. పొద్దుటి నుంచీ ఆ చుట్టుపక్కల అంతటా టెలిఫోన్ కనెక్షన్లు చెడిపోయాయి. బాగు చేస్తున్నారు.

మళ్లీ భుజంగరావుగారూ వాళ్లూ కారులో బయలుదేరి ఇంటికెళ్లి అక్కణ్ణించి ఫోన్ చేశారు అమెరికాకి. అమెరికా నుంచి ఇక్కడికి వెంటనే రావడానికి టిక్కెట్ బుక్ చేసుకోమనీ, ఇంకా ఇరవై నాలుగు గంటలు చూడాలంటున్నారనీ చెప్పారు మాధవరావు కొడుకుతో.

ఓ గంట తరవాత కనిపించిన ఒక నర్స్‌ని అడిగితే, "ఇంక రక్తం ఇవ్వక్కర్లేదు... డయాలిసిస్ పని చేస్తోంది," అని చెప్పి వెళ్లింది. మళ్లీ ఆశ పుంజుకుంది మాలో.

ఈలోగా హాస్పిటల్లో ఎవరి దగ్గరో ఎవరో విన్న గాలికబుర్లు- బైపాస్ ఆపరేషన్ అవగానే మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చిందనీ, తరవాత బెలూన్ థెరపీ చేస్తూంటే బెలూన్ పొత్తికడుపులోకి జారిందనీ, పొత్తి కడుపు కోశారనీ, కిడ్నీలో రక్తం నిండిపోయిందనీ, దాన్ని బయటికి పంపవుట్ చేశారనీ... ఇలా! ఇందులో వైద్యరీత్యా నిజం ఎంతో, అబద్ధం ఎంతో, ఏది నమ్మాలో, ఎవర్ని

నమ్ముకోవాలో ఏమీ అర్థంకాలేదు. అయోమయంగా ఆవేదన పడటం మినహాయించి బాధ్యత గల డాక్టర్లు ఎవరూ కనిపించరు. కనిపించినా చెప్పడంలేదు. తిప్పలు పడుతున్నారో, తప్పించుకు తిరుగుతున్నారో ఏమీ తెలియడం లేదు. పేషంట్ ఇంకా ఆపరేషన్ థియేటర్‌లోనే వున్నాడు.

సిజేరియన్ ఆపరేషన్‌లాగ బైపాస్ ఆపరేషన్ కూడా ఈరోజుల్లో సామాన్యమైపోయింది. డెబ్బై ఏళ్ల వాళ్లు కూడా చేయించుకుని నిక్షేపంగా తిరుగుతున్నారు. మాధవరావుకి యాభైమూడే. ఇతనికేమిటి, ఏం భయం లేదు అని చెప్పుకున్న ధైర్యం అంతా అయిపూ మచ్చా లేకుండాపోయింది. అధైర్యం అణువణువునా ఆవహిస్తోంది. అయినా అపనమ్మకం కలగడం లేదు. లోపల ఏదో జరుగుతోంది. ఏవో తంటాలు పడుతున్నారు. గట్టెక్కిస్తారు అనే అనుకుంటున్నాం.

రాత్రి ఏడున్నరయింది. పేషంట్‌ని మళ్లీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కి తీసుకువచ్చారని కబురొచ్చింది! మా అందరిలోనూ ఆశాజ్యోతులు వెలిగాయి. పోనీలే, మొత్తం మీద గట్టెక్కించాడు భగవంతుడు అని కొంత ఊరటతో నిట్టూర్పులు విడిచాం. కరుణ మాత్రం కళ్లూ, ముక్కూ తుడుచుకోవడం మానలేదు. కూతురు అనుపమ తన ఆందోళననీ, ఆవేదననీ అణచిపెట్టుకుని తల్లిని అంటిపెట్టుకుని వుంది ధైర్యం చెబుతూ.

మాలో కొందరం ఇంటికి బయలుదేరాం మళ్లీ పొద్దున్నే రావచ్చుననే ఉద్దేశంతో. తీరా ఇంటికి వెళ్లి చెప్పులైనా విప్పలేదు, హాస్పిటల్ నుంచి ఫోనొచ్చింది 'ఆశ లేదంటున్నా'రని. హాస్పిటల్లో ఫోన్ కనెక్షన్లు బాగు పడినట్లున్నాయి.

వచ్చినవాళ్లం వచ్చినట్లే తలుపులు తాళాలు వేసుకుని బయలుదేరాం. మేం వెళ్లేసరికి గదిలో కరుణ కుళ్లకుళ్లి ఏడుస్తోంది. హాస్పిటల్లో గదిలో అయినా సరే గట్టిగా ఏడవడానికి వీల్లేదు కదా.

అంతా అయిపోయిందేమోనని క్రుంగిపోయాం. కానీ, ఇంకా ఆ కబురు రాలేదు.

"హార్ట్ లంగ్ మెషీన్ పెట్టాం... ఎవరైనా చూడవలసిన వాళ్లుంటే పిలిపించండి," అని అందరికన్నా సీనియర్ సర్జన్ వచ్చి చెప్పాడు. అంతవరకూ అజ్ఞానంలో వుంచి చివరికి కొంపముంచారు అని రోదిస్తోంది కరుణ.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కి మళ్లీ తీసుకొచ్చారని ఏడున్నరకి చెప్పినప్పుడు మాధవరావు కోలుకుంటున్నాడు కాబోలునని భ్రమపడ్డాం. మొదట్లో క్లిష్ట పరిస్థితి ఏర్పడినప్పుడే నిజస్థితి సూచించి, 'మేం చెయ్యగలిగినదంతా చేస్తున్నాం. ధైర్యంగా వుండండి,' అని చెప్పి, మధ్య మధ్య ఎలా వున్నదీ రిపోర్ట్ ఇచ్చి వుంటే ఇంత ఘోరం అనిపించేది కాదు. వాళ్లకీ మాకూ మధ్య 'రక్త' సంబంధమూ, 'బిల్లుల' బంధమూ తప్ప మరే విధమైన సంపర్కమూ లేకుండా చేశారు. చేతుల్లో పెట్టిన మనిషిని చీల్చి చెండాడారు. ముప్పయి ఆరుగంటల పాటు మరీచికలు చూపించి మూఢ నిరీక్షణలో ముంచి మా గుండెలు మెలిపెట్టారు.

మళ్లీ ఇప్పుడు మరోరకం నిరీక్షణ- అంతిమశ్వాస తీసుకోవడం అయిందన్న విశ్వసనీయమైన వార్త కోసం నిర్లిప్తతతో నిరీక్షణ.

అమెరికా నుంచి కొడుకు బయలుదేరాడని ఫోనొచ్చింది. మూడోనాటి ఉదయానికిగాని స్వదేశానికి చేరుకోలేడు. అప్పటివరకూ అతనికోసం ఆవేదనతో భారమైన నిరీక్షణ.

రాత్రి పన్నెండు దాటింది. హాస్పిటల్ నిద్రాణంగా వున్నట్టు నిశ్శబ్దంగా వుంది. మేము కాలుకాలిన పిల్లుల్లా వరండాలో ఇటూ అటూ తిరుగుతున్నాం. మధ్య మధ్య కరుణ కన్నీళ్లు చూసి వస్తున్నాం.

ఒంటిగంటయింది. అనుపమ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ వైపు వెళ్లింది- పరిస్థితి ఎలా వుందో ఏమైనా తెలుస్తుందేమోనని. లోపలికి వెడుతుంటే కాపలాకు కూర్చున్నతను అభ్యంతరం చెప్పలేదు. లోపలికి వెళ్లి రోగుల మంచాలన్నీ దాటుకుంటూ ఇంకా లోపలికి వెళ్లింది. తండ్రి మంచం దగ్గరకు చేరుకుంది. నిశ్శబ్దంగా పడుకుని వున్నాడు. ప్రశాంతంగా వుంది ముఖం- బాగా ఉబ్బి ఉన్నప్పటికీ ఏ బాధా వున్నట్టులేదు. అంతకు ముందులా ముక్కుల్లోనూ, చేతులమీదా, గుండెమీదా, గొంతులోనూ గొట్టాల్లేవు. ఆశ్చర్యబోయింది. పక్కకి తిరిగి చూసింది డాక్టర్ కోసం. మరో రోగి మంచం దగ్గర నుంచి అనుపమ దగ్గర కొచ్చాడు డాక్టర్.

"ఎలావుంది డాక్టర్ కండిషన్?" అంది అనుపమ. తన గొంతు తనకే వినిపించనంత మెల్లిగా.

"ఐయామ్ సారీ, ప్రాణం పోయి అరగంటయింది," అన్నాడు డాక్టర్.

"అరె! మాకు చెప్పలేదే!" అంది అనుపమ నిర్ఘాంతపోయి.

"సారీ, నేను వేరే ఎమర్జెన్సీ కేసొకటి చూస్తూ బిజీగా వున్నాను," అన్నాడు.

''చెప్పడానికి ఇంకెవరూ లేరా ఈ చుట్టు పక్కల?'' ఆ ప్రశ్నని గొంతులోనే అణిచేసుకుంటూ అనుపమ మూగగా ఇటూ అటూ చూసింది.

తండ్రికేసి జాలిగా చూసిందొకసారి. అయిన వాళ్లెవరూ పక్కని లేకుండా దిక్కులేని చావు చచ్చిపోయి నట్టనిపించి కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి.

"బాడీని ఏం చెయ్యమంటారు?" అని అడిగారు. డాక్టర్ ప్రశ్నకి గుండె భగ్గున మండింది.

"మా పెద్దవాళ్లని అడగండి," అనేసి వెంటనే వెనక్కి తిరిగి మేమున్న చోటికి వచ్చేసింది.

ఆ మాటలు విన్నాక మాక్కూడా మండిపో యింది. గుండెలు కోసి కోసి ఈ డాక్టర్లకి దయా దాక్షిణ్యాలు నశించిపోయాయేమో. సున్నితమైన అను భూతుల అవశేషాలు కూడా లేవేమో అనిపించింది.

కొడుకు అమెరికా నుంచి వచ్చేవరకూ మాధవ రావు శవాన్ని శవాల గదిలో పెట్టడానికి ఏర్పాటుచేశారు.

ఆఖరికి-

మూడోనాడు శవాన్ని తీసుకురావడానికి వెళ్లి నప్పుడు పన్నెండువేలకి బిల్లు ఇచ్చారు! తీరాచూస్తే, శవాల గది ఎయిర్ కండిషన్డ్ కూడా కాదు. కేవలం ఐస్ గడ్డలమీద పడుకోబెట్టి, శవంపైనా, చుట్టూ ఉప్పు జల్లి వుంచారు. అంతే అయినా, అది మామూలు శవాల హాలు కాదుకదా. అయిదు నక్షత్రాల శవశాల అది!

మరణం ధ్రువం అన్న సత్యం అందరికీ తెలి సిందే. కానీ, అది ఎప్పుడు ఎక్కడ ఎలా వస్తుందో నిర్ధారణగా ఎవరూ చెప్పలేరు. అందుకే మరణం అంటే అంత భయం. మరణం అంటే అంత కుతూహలం.

మృత్యువుని రమ్మనీ, ఆగమనీ ఆదేశించడంలో అర్థంలేదు. అయినా ఆశ వదలదు మనిషిని. దైవం పట్ల అచంచల భక్తి వుంది. ఆధునిక వైద్య సౌకర్యాల పట్ల ఆరాధన వుంది. మృత్యువు సమీపించకుండా కొంత కాలం ఆపలేమా అనీ, కనీసం ఓ అయిదేళ్ల అదనపు జీవితాన్ని కొనుక్కోలేమా అనీ ఆశ పుడుతుంది.

అటువంటి ఆశతోనే మాధరావు అంత పెద్ద, అంత పేరు పొందిన ఆస్పత్రికి వెళ్లాడు. నిజానికి, మరణాన్ని కొనుక్కోడానికి అంత దూరం, అంత ప్రయాసపడి ఎవరూ వెళ్లనక్కర్లేదు. మనం పిలిచినా పిలవకపోయినా రావలసిన సమయంలో అదే వస్తుం దని అర్థమయింది.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 13 సెప్టెంబర్ 1991*